

జలపాతాల నెలవు.. ఏడు గుండాల కోన



కనుల పండువగా మహాదేవుని శోభాయాత్ర

● శివనామస్మరణతో మార్మోగిన కడప నగరం


నగరంలో సాగుతున్న శోభాయాత్ర

కడప కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం... సర్వజన హితార్థం మహా కుంభమేళా సందర్భాన్ని పురష్కరించుకుని మహాదేవుని మహా శోభాయాత్ర కార్యవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో కనుల పండువగా సాగింది. శోభాయాత్రలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు మహాదేవునికి స్వాగతం పలికారు. నగర మృత్యుంజయకుంట శివాలయంలో ఉదయం ఆ ఆలయ ప్రధాన అర్చకులు శశిధర్‌శర్మతో పాటుగా చంద్రమౌళిశర్మ, గోపాలకృష్ణశర్మ, శ్రీధర్‌శర్మల సారథ్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేషపూజల అనంతరం శోభాయాత్ర ప్రారంభమైంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మాహాదేవుని ప్రతిరూపమైన శివలింగాన్ని ఏర్పాటుగావించారు. ఆ మేరకు శివాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర వైజంక్షన్, అంబేడ్కర్ సర్కిల్, రాజీవ్‌మార్గ్, సంధ్య సర్కిల్, ఐటిఐ, కాగితాలపెంట, కోటిరెడ్డిసర్కిల్, నాగరాజుపేట, పాతబస్టాండ్, 7 రోడ్లు, 1టౌన్‌సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్, క్రిష్ణసర్కిల్, అన్నమయ్య సర్కిల్, అప్సరాసర్కిల్ మీదుగా తిరిగి మృత్యుంజయకుంట శివాలయం వరకు సాగింది. ఇదిలా వుండగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ పుణ్యక్షేత్ర త్రివేణి సంగమంలో 144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా సాగుతున్న నేపథ్యంలో అక్కడ స్నానమాచరించి ఆ దేవదేవుని సేవలో పునీతులు కావాలని ప్రతిఒక్కరికీ వుంటుంది. కాగా అక్కడికి వెళ్లలేని వారికోసం అక్కడి పవిత్ర జలంతో పాటుగా ప్రముఖ నదీ జలాలను శోభాయాత్ర నిర్వాహకులు కడపకు తెప్పించారు. ఆ జలాన్ని శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలందరికీ సంప్రోక్షణ గావించారు.


శివుడి వేషధారణలో కళాకారుడు

అలరించిన కళాకారులు

మహాదేవుని శోభాయాత్రలో సుండుపల్లెకు చెందిన కళాకారులు వివిధ భక్తి పాటలకు చేసిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. అదేవిధంగా శివ, పార్వతుల వేషధారణలతో పాటుగా మహర్షుల వేషధారణలతో కళాకారులు ప్రదర్శించిన భక్తిపాటలు పలువురిని అలరించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో శోభాయాత్ర కార్యవర్గ సభ్యులు కె.విజయానందరెడ్డి, కొండారెడ్డి, శంకరరెడ్డి, శ్రీధర్‌స్వామి, కృష్ణారెడ్డి, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

అమృత్.. ఆపసోపాలు

● కోట్లు వెచ్చించినా పూర్తికాని పెండింగ్ పనులు
● కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పూర్తిచేయని వైనం
● పట్టించుకోని పబ్లిక్ హెల్త్ అధికారులు
● ఐదేళ్ల మెయింటనెన్సు చేయకనే అప్పగింతకు యత్నం




రామేశ్వరంలోని ట్రీట్‌మెంట్ ప్లాంటు, ఈఎల్‌బీఆర్ వద్ద పెరిగిన జంబు, నిలిచిన నీరు


మౌలానా ఆజాద్ వీధిలోని రిజర్వాయర్‌కు ప్రహరీ, వాచ్‌మన్ గది నిర్మించని దృశ్యం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా నివారించడానికి రూ.151.38 కోట్లతో ఏర్పాటు చేసిన అమృత్ స్కీం ఆపసోపాలు పడుతోంది. పెండింగ్ పనులు పూర్తిచేయకుండా వదిలేయడంతో చాలా చోట్ల లీకేజీలు అవుతున్నాయి. లక్ష్యం మేరకు కొన్ని ప్రాంతాలకు ఇప్పటికీ తాగునీరు అందడం లేదు. మైలవరం జలాశయం నుంచి ప్రొద్దుటూరుకు పైప్‌లైను ద్వారా నీటిని సరఫరా చేయడానికి తాగునీటి పథకం రూపొందించారు. ఈ మేరకు 16 నవంబరు 2017న మెగా ఇంజనీరింగ్ కంపెనీకి పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంటు వర్కు ఆర్డర్ ఇచ్చింది. అదే ఏడాది డిసెంబరు 8న పని అగ్రిమెంటు జరిగింది. 15 నెలల కాలంలో పూర్తి చేయాలని గడువు పెట్టారు.

అమృత్ పథకంలో భాగంగా మైలవరం రిజర్వాయర్ నుంచి 31.1 కి.మీ మేర 900 ఎంఎండీఐ పైపులతో ప్రొద్దుటూరు రామేశ్వరం హెడ్ వాటర్‌వర్క్సు వరకు పైప్‌లైను నిర్మాణం చేపట్టారు. మైలవరం జలాశయం నీరు రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్సులోని ట్రీట్‌మెంట్ ప్లాంటుకు చేరుతుంది. అక్కడి నుంచి పట్టణంలో ఆర్ట్స్ కాలేజీ, వెటర్నరీ కాంపౌండ్, మౌలానా ఆజాద్ వీధులలో నిర్మించిన మూడు రిజర్వాయర్లకు నీళ్లు చేరతాయి.



అమృత్ స్కీంకు చెందిన 43 ఎంఎల్‌డీ కెపాసిటీ గల ట్రీట్‌మెంట్ ప్లాంట్

ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.38.58 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.15.29 కోట్లు, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ వాటాగా రూ.97.51 కోట్లు నిధులు ఖర్చు పెట్టారు. జులై 2023 నాటికి పనులు పూర్తి చేసి మైలవరం నుంచి పైప్‌లైను ద్వారా ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరం హెడ్ వాటర్‌వర్క్సు దగ్గర ట్రీట్‌మెంట్ ప్లాంట్ వరకు నీటి సరఫరా ప్రారంభించారు. ఈ స్కీం పూర్తయినప్పటి నుంచి 5 సంవత్సరాలు మెయింటనెన్సు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ స్కీం ప్రారంభించి రెండు సంవత్సరాలు కూడా మెయింటెనెన్సు పూర్తి కాకముందే మున్సిపాలిటీకి అప్పగించి చేతులు దులుపుకోవాలని మెగా కంపెనీ చూస్తోంది. అందుకోసం పబ్లిక్ హెల్త్ అధికారులు కూడా పరోక్ష సహకారం అందిస్తున్నారని ప్రచారం సాగుతోంది.

ఇవీ పెండింగ్ పనులు

● మైలవరం సబ్‌స్టేషన్ నుంచి రిజర్వాయర్ దగ్గర ఉన్న ఇంటెక్ వెల్ వరకు 11 కేవీ ఎక్స్‌ప్రెస్ లైను వద్దకు ఇన్‌స్టాల్ చేయలేదు.
● ఎయిర్ వాల్వులకు వాల్వ్ పిట్‌లు నిర్మించలేదు.
● రిజర్వాయర్ల వద్ద కాంపౌండ్ వాల్స్, వాచ్‌మ్యాన్ గదుల నిర్మాణం చేయలేదు.
● రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్సు వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు బ్యాక్ వాష్ వాటర్ ప్రవహించేందుకు ప్రత్యేక పైప్‌లైను ఏర్పాటు చేయలేదు.
● ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద వాల్వ్ పిట్స్ స్లాబ్‌లు ఏర్పాటు కాలేదు.
● పాత మార్కెట్‌లోని రిజర్వాయర్‌కు నేటికీ మైలవరం జలాశయం శుద్ధి నీరు పంపింగ్ చేసి నింపలేదు.
● రామేశ్వరం హెడ్ వాటర్‌వర్క్సులో పనులు జరుగుతున్నప్పుడు కాంపౌండ్ వాల్ కూలిపోయింది. కొత్తగా కాంపౌండ్‌వాల్ నిర్మించలేదు.
● హెడ్‌వాటర్ వర్క్సులో అంతర్గత రోడ్లు నిర్మించలేదు.
● రివర్‌బండ్ వైపు, రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్సు లోపల మెగా కంపెనీ నిర్మాణం చేపట్టలేదు. ఈ పనులు చేయాలంటే మున్సిపాలిటీకి మళ్లీ వ్యయభారం అవుతుంది. కానీ మెగా ఇంజనీరింగ్ సంస్థ పెండింగ్ పనులు పూర్తిచేయకనే మున్సిపాలిటీకి స్కీంను అప్పగించే ప్రయత్నం చేస్తోంది.

పెండింగ్ పనులు పూర్తి చేయిస్తాం

రెండు ఫిల్టర్ బెడ్‌లకు మరమ్మతులు చేశాం. పాతమార్కెట్ రిజర్వాయర్‌కు పంపింగ్ టెస్ట్ చేశాం. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆర్అండ్‌బీ రోడ్డులో లీక్ వస్తోంది. దీంతో పంపింగ్ చేయలేదు. ఆర్అండ్‌బీ అధికారులు ముందుగా డబ్బులు కట్టనిదే రోడ్డు తవ్వనీయమని అడ్డుపడుతున్నారు. దీంతో ఆ పనులు ఆలస్యం అవుతున్నాయి. రామేశ్వరం హెడ్ వాటర్‌వర్క్సులో మార్చిలో అంతర్గత రోడ్లు నిర్మిస్తాం. తక్కిన పెండింగ్ పనులు సైతం పూర్తి చేయిస్తాం. ఐదేళ్ల మెయింటనెన్స్ కాంట్రాక్టర్ ద్వారానే చేయిస్తాం.

- వీరకుమార్ రెడ్డి, ఏఈఈ, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్

ప్రశాంతంగా గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలు

● ఉదయం 87.74 ● మధ్యాహ్నం 87.48 శాతం మంది హాజరు
● డీఆర్వో విశ్వేశ్వరనాయుడు


పరీక్ష సమయం ముగుస్తుండడంతో పరుగెత్తుకుంటూ వస్తున్న ఓ అభ్యర్థి

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 13 పరీక్షా కేంద్రాల్లో జరిగిన గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలు ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగాయని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూపు-2 ఉద్యోగాల నియామకం కోసం ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో నిర్వహించిన మెయిన్స్ పరీక్షకు సంబంధించి జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలు కేటాయించారు. మొత్తం 5825 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా ఉదయం 5111 మంది హాజరై 87.74 శాతంగా, మధ్యాహ్నం సెషన్‌లో 5825 మందికి గానూ 5096 మంది హాజరై 87.48 శాతంగా నమోదైందని తెలిపారు. జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించాయని డీఆర్వో ఆ ప్రకటనలో వివరించారు.


పరీక్షకు హాజరైన అభ్యర్థులు


నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పోలీసుల బందోబస్తు


అభ్యర్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

● అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు
● ఆర్జేడీ రవి

వివరాలు.. 7లో

అయోధ్యలో ఓబులవారిపల్లె వాసి మృతి

వివరాలు.. 7లో

కుక్కల దాడిలో 53 గొర్రె పిల్లలు మృతి

● లబోదిబోమంటున్న గొర్రెల కాపర్లు

వివరాలు.. 7లో

వైవీయూ వీసీగా ప్రకాష్‌బాబు

● నేడు బాధ్యతల స్వీకరణ


ప్రొఫెసర్ ప్రకాష్‌బాబు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ప్రొఫెసర్ ఫణితి ప్రకాష్‌బాబు నియమితులయ్యారు. గతంలో వీసీగా పనిచేసిన ప్రొఫెసర్ చింతా సుధాకర్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ కారణాలతో జూన్ 29న రాజీనామా చేశారు. అనంతరం ఇదే యూనివర్సిటీలో భౌతికశాస్త్ర సీనియర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డిని ఇన్‌చార్జి వీసీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరబ్‌గౌర్ జూలై 17న ఉత్తర్వులు విడుదల చేయగా, 19న ఆయన బాధ్యతలు చేపట్టి కొనసాగుతున్నారు.

విద్యారంగానికి కొత్త దిక్సూచి


సెంట్రల్ యూనివర్సిటీలో పనిచేసిన వారిని వీసీలుగా నియమించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్‌మేటిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఫణితి ప్రకాష్‌బాబును ఎంపిక చేశారు. ఈయన వైవీయూలో సరికొత్త దిశను చూపేందుకు సిద్ధమవుతున్నారు.

ముందున్న సవాళ్లు

వీసీగా బాధ్యతలు చేపట్టనున్న ప్రొఫెసర్ ప్రకాష్‌బాబుకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. గత వైసీపీ హయాంలో జరిగిన నియామకాలు అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలని విద్యావేత్తలు కోరుతున్నారు. అలాగే నిలిచిపోయిన హెల్త్ క్లినిక్ నిర్మాణంపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. కనీసం జ్వరానికి కూడా మందులు లేవన్న ఆరోపణలు ఉన్నాయి. నిధులు పుష్కలంగా ఉన్న డిస్పెన్సరీలో మందులు వివిధ సేవలు లేకపోవడంపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నేడు చేపట్టనున్న బాధ్యతలు

వీసీగా నియమితులైన ఫణితి ప్రకాష్‌బాబు సోమవారం ఉదయం 10 గంటలకు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి వీసీగా విధులు నిర్వహించిన ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి నూతన ఉపకులపతి ప్రొఫెసర్ ప్రకాష్‌బాబుకు బాధ్యతలు అప్పగించనున్నారు.


గండికోట ప్రాజెక్టు వద్ద రెండు కొండల నడుమ కనువిందు చేస్తున్న సూర్యుడు



గ్రాండ్.. ఎంజాయ్

గ్రాండ్ కెనాన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన గండికోట పెన్నాలోయ వద్ద వారాంతం అయితే చాలు.. సందడిగా మారు తోంది. సహజసిద్ధంగా ఏర్పడిన పెన్నా లోయ అందాలతో పాటు ఇక్కడ సంధ్యాసమయాలను చూసేందుకు ఉత్సాహం చూపు తుంటారు. పలువురు శనివారం సాయంత్రమే గండికోటకు చేరుకుని రిసార్టులలో బసచేసి ఆదివారం ఉదయం లోయవద్దకు వెళ్లి ఫొటోలు దిగుతుంటారు. ఈ శని, ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చిన పర్యాట కులతో సందడిగా మారింది. ఫొటో షూట్‌లు చేసుకునేవారు, సెల్ఫీలు తీసుకునేవారు, ట్రైప్యాడ్‌తో గ్రూప్ ఫొటోలు దిగేవారంతా లోయవద్ద ఉత్సాహంగా కనిపించారు.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప


పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు


గండికోట పెన్నా లోయ వద్ద ఓ జంట ఫొటో షూట్

జలపాతాల నెలవు ఏడు గుండాల కోన



రైల్వేకోడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దట్టమైన అడవులు, దూకే జలపాతాలు, గలగల పారే వంకలు.. ప్రకృతి అందాలకు నెలవు ఏడు గుండాల కోన. రైల్వేకోడూరు నుంచి 22 కిలోమీటర్ల దూరంలో ఈప్రాంతం ఉంది. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతుంది. రాజంపేట ఆర్టీసీ అధికారులు గుండాలకోనను సందర్శించి ఇప్పటికే మూడు బస్సులను ట్రయల్‌రన్ చేశారు. కోనలోనూ శివరాత్రి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతి సోమవారం ఇక్కడ ప్రత్యేక పూజలు జరుగుతాయి.

ఓబులవారిపల్లె మండలం వై.కోట ప్రాంతంలోని కొండకోనల్లో గిన్నిగుండం, పసుపుగుండం, బూడిగుండం, సమారాధనగుండం, అభిషేక గుండం, జలగండం, సంతర్పణ గుండం, మాదిగ గుండం అనే ఏడు గుండాలు ఉన్నాయి. ప్రతి కోనలోను జలపాతాలు దూకుతూ ఉంటాయి. గుండాలకోనలో నీలకంఠేశ్వరుడి ఆలయం ఉంది. తాళ్లపాక అన్నమ య్య కుమారుడు తాళ్లపాక తిరుమలయ్య గుండాలకోన క్షేత్రాన్ని సందర్శించి ఇక్కడ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడ ఉన్న ఒక తెలుగు శాసనలో ఇది లిఖితమై ఉంది. శకవర్షంబులు 1456 అగునేంబుడు జేష్ఠ మఖ నాండు తాళ్లపాక తిరుమలయ్య గారు ఇక్కడికి ఏతెంచిరి. హనుమంతుని ప్రతిష్ఠ చేసిరి అనే అక్షరాలు ఉన్నాయి. ఆలయ పరిస రాల్లోనే ఇంకో శాసనం కూడా ఉంది. వెంకట గిరి రాజులు కూడా ఈ ఆలయాన్ని సందర్శించి పూజలు చేసేవారు. శివరాత్రికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. ముందుగా వైకోట గ్రామ స్థు లు కలిసి కోనకు దారి సరిచేస్తారు. శివరాత్రి పర్వదినాన అటవీ, పోలీసుశాఖల అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. వేలాది మంది భక్తులు వచ్చి పూజలు చేస్తారు. అన్నదానాలు నిర్వహిస్తారు.



ఎండ్రకాయలకోన జలపాతం వద్ద భక్తులు (ఫైల్)

ఎండ్రకాయల కోన



ఆలయం వద్ద శివలింగం

చిట్వేలి మండలంలోని అటవీ ప్రాంతంలో ఉన్న ఎండ్రకాయల కోన కూడా శివరాత్రికి భక్తులతో కిటకిటలాడుతుంది. ఇక్కడ తపస్సు చేసిన రంగనాయకస్వామి నగరిపాడులో 1710 లో అగ్ని సమాధి అయ్యాడని చెబుతారు. 1886-87 మధ్యలో ఈ కోనకు బ్రిటీష దొరలు కాలి మార్గం ఏర్పాటు చేయించారు. గతంలో గ్రామస్తులు కలసి చిన్న పాటి గదిని నిర్మించారు. రానురాను ఈ కోన అభివృద్ధి చెందుతోంది. ప్రజల విరాళాలతోకుని రూ. కోటి తో పలు పనులు చేశారు. కూటమి ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి, రోడ్డు కోసం రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేసిందని ఆలయ కమిటీ ఛైర్మన్ రాజశేఖర్, ప్రధాన కర్త ఈశ్వరయ్యలు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కలికిరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె వెళ్లే జాతీయ రహదారిలో ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో కారు ఢీకొనడంతో చెరువుముందరపల్లెకు చెందిన మనికి శంకర (35) మృతి చెందాడు. రోడ్డు పక్కన వ్యర్థ పదార్థాలు సేకరిస్తున్న క్రమంలో వేగంగా వెళుతున్న వాహనం ఢీకొంది. ఇది గమనించిన స్థానికులు అతడిని వెంటనే కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే ఇంజనీరింగ్ కళాశాల బాలుర హాస్టల్ ఎదురుగా మూరేవాండ్ల పల్లె రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వాల్మీకిపురం మండలం జోగినాయనిపల్లెకు చెందిన జోగినాయన పెద్ద రెడ్డెప్ప (78) మృతి చెందినట్లు సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రైతు మృతి



వెంకటనారాయణ (ఫైల్)

ములకలచెరువు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతు మృతి చెందాడు. ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో చికిత్స పొందుతూ రైతు కన్నుమూశాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని సోంపల్లె పంచాయతీ తలారివారిపల్లెకు చెందిన రైతు తలారి వెంకటనారాయణ (60) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి భార్య సుజాత, కుమారుడు చిక్రీ, కుమార్తె నందిని ఉన్నారు. ప్రస్తుతం రైతు వెంకటనారాయణ టమోటా పంట సాగు చేశాడు. ఈ క్రమంలో పంటకు స్ప్రే చేసేందుకు మందులు తేవడానికి ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. స్థానిక పెట్రోల్ బంకు వద్ద ద్విచక్రవాహనాన్ని వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంతో రైతు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించిన విషయం విదితమే. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయాకు తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం



స్క్రాప్ గోడౌన్‌లో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కడప క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం భవానీనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పు రవ్వలు కిందపడి స్క్రాప్‌కు మంటలు అంటుకున్నాయి. ఆ పక్కనే ఉన్న బార్బర్ షాపులోకి కూడా మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు కడప ఫైర్ అధికారి బస్విరెడ్డి ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. భవానీ నగర్‌లో హరీస్‌ట్రేడర్స్ భవనం పక్కన స్క్రాప్ బిజినెస్ నిర్వహిస్తున్నారు. అయితే పైన రెండు విద్యుత్ తీగలు జాయింట్ కావడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పురవ్వలు కింద పడి స్క్రాప్‌కు అంటుకోవడంతో మంటలు వ్యాపించి కాలిపోయింది. పక్కన పి.రామచంద్ర బార్బర్ షాపునకు మంటలు వ్యాపించడంతో.. దాదాపు లక్షా 50వేల మేర ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని గట్టు గ్రామం దిన్నెమీదపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసినట్టు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు ఆదివారం తెలిపారు. మండలంలోని నాయనబావి పంచాయతీ గుట్టపాళ్యంకు చెందిన రవీంద్రరెడ్డి తన కుమారుడైన యశ్విన్‌రెడ్డి (4)ని ద్విచక్ర వాహనంలో తీసుకుని వెళుతుండగా వెనుక వైపు నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొని తండ్రీకొడుకులు గాయపడి మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈనెల 21న జరిగిన ఈ సంఘటనకు సంబంధించి రవీంద్రరెడ్డి తండ్రి రెడ్డెప్పరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో మహిళ అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామ ఎస్సీ కాలనీలో ఈనెల 15వ తేదీ జరిగిన హత్య కేసులో గని అరుణ అనే మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం డీఎస్పీ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కంభం శివరామిరెడ్డి చిలంకూరు గ్రామంలో గని అరుణతో రెండేళ్ల క్రితం వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో ఒక సంవత్సరం నుంచి అరుణ తన ఇంటి ఎదురుగా ఉన్న జగన్నాధం ఆదెన్నతో వివాహేతర సంబంధం ఉన్నట్లు శివరామిరెడ్డికి తెలియడంతో ఇద్దరిని మందలించాడు. ఇది మనసులో పెట్టుకొని పతకం ప్రకారం ఆయనను చంపాలని చిలంకూరులోని అరుణ ఇంటికి 15వ తేదీ రాత్రి పిలిపించుకున్నారు. ఇంటిలోకి రాగానే శివరామిరెడ్డిపై కళ్లలో కారం కొట్టి జగన్నాథం ఆదెన్న తాడుతో మెడకు గట్టిగా బిగించి చంపి మృతదేహాన్ని ఆటోలో తీసుకుపోయి తొండూరు మండలం మల్లెల ఘాట్‌లో పడేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎర్రగుంట్ల పోలీసులు కేసు నమోదు చేసి అనుమానిత అరుణను అరెస్టు చేసి విచారించగా శివరామిరెడ్డి సెల్‌ఫోన్‌ను, చెప్పులను, అతని మెడకు వేసిన చంపి తాడును ఎవరికి తెలియకుండా ఉండాలని కాల్చి బూడిదను కాలువలో పడవేసినట్లు తెలిపిందన్నారు. మరో నిందితుడు ఆదెన్న పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు.

కుక్కల దాడిలో 53 గొర్రె పిల్లలు మృతి



కమలాపురం రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సి.గోపలాపురంలో కుక్కలదాడిలో 53 గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధితుల వివరాల మేరకు... గోపులాపురం గ్రామానికి చెందిన చల్లా సుబ్బయ్య, గొర్ల ఓబయ్య గొర్రెలను పాచికలపాడు గ్రామ పొలంలోకి మేత కోసం తోలుకెళ్లారు. గొర్రె పిల్లలకు మాత్రం కంచె ఏర్పాటు చేసి అక్కడే వదిలేసి వెళ్లగా.. కుక్కలు దాడి చేయడంతో దాదాపు 52 గొర్రెపిల్లలు మృతి చెందాయి. దీంతో దాదాపు రూ.2లక్షలు నుంచి రూ.3లక్షలు నష్టపోయామని గొర్రెల కాపర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ బోల్తా... డ్రైవరు మృతి



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం ఆర్‌టీ పీపీ రోడ్డులో ఆదివారం ఉదయం ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడ టంతో డ్రైవరు మృతి చెందాడు. మృతుడు ఆళ్లగడ్డకు చెందని గైబు (34)గా పోలీసులు గుర్తించారు. ఆర్‌టీపీపీలోని ప్లయాష్ కోసం వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేసి కేసు నమోదు చేశారు.

అయోధ్యలో ఓబులవారిపల్లె వాసి మృతి



సుధాకర్‌రెడ్డి (ఫైల్)

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్ర జ్యోతి): కువైట్ నుంచి ఇండియాకు వచ్చి మిత్రులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురై ఆదివారం మృతి చెందాడు. ఓబులవారిపల్లెకు చెందిన నూకా పాపుగారి సుధాకర్‌రెడ్డి(47) ఈనెల 20న కువైట్ నుంచి 20 మంది బృందంతో వచ్చి.. కుంభమేళాకు వెళ్లారు.

అక్కడి నుంచి అయోధ్యలో శ్రీరాముని దర్శనం కోసం ఆదివారం మధ్యాహ్నం వెళ్లారు. ఆ సమయంలో సుధాకర్‌రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురికాగా.. ఆసుపత్రికి తీసుకెళ్లేక్రమంలో మృతి చెందాడు. ఈ సమాచారం కుటుంబ సభ్యులకు తెలియడంతో విషాదఛాయలు అలముకున్నాయి.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు : ఆర్జేడీ రవి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ రవి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్జేడీ రవి పేర్కొన్నారు. ఏమాత్రం అలసత్వం వహించినా క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం కడప నగరం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు కస్టోడియన్ అడిషనల్ సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1వ తేది నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఈ పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో జరుగుతాయని సూచించారు. ఇంటర్ బోర్డు సూచనలను పాటిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు. ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించి, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. జిల్లా కార్యాలయంలో పరీక్షలకు సంబంధించి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, విద్యార్థుల తల్లిదండ్రులు ఏదైనా సమస్య ఉంటే 08562 244171 నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. డీసీ సభ్యులు బి.వెంకటసుబ్బయ్య, రామిరెడ్డి, ఎన్.శివహరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లాలో...

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పరిధిలోని పరీక్షల నిర్వహణ అధికారులతో సమావేశమై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో జరుగుతాయన్నారు. లైవ్ స్ట్రీమింగ్ ద్వారా జిల్లా కేంద్రంలో ఇంటర్ బోర్డు ప్రధాన కేంద్రంలో నిరంతరం పర్యవేక్షణలో ఉంటుందన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో గాలి, వెలుతురు ఉండేలా చూడాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు టాబ్లెట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 అమలులో సెక్షన్ ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడ మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా పరీక్షలను చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్స్ ప్రకాశ్, అమరేంద్ర కుమార్, నాగసురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల నిప్పు... రైతన్నలకు తీవ్ర నష్టం

- చింతవారిపల్లె వద్ద రెండున్నర ఎకరాల ఉలవ పంట దగ్ధం
- కాలిపోయిన డ్రిప్ పైపులు, టమోటా కట్టెలు... రూ.2 లక్షల వరకు నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ములకలచెరువు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు పెట్టిన నిప్పు రైతన్నలకు తీవ్ర నష్టం చేకూర్చింది. గుట్టకు నిప్పు పెట్టడంతో మంటలు పొలాల వైపు మళ్లడంతో రెండున్నర ఎకరాల ఉలవ పంట, డ్రిప్, పీవీసీ పైపులు, టమోటా కట్టెలు, కొబ్బరి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్థుల కథనం మేరకు... మండలంలోని సోంపల్లె పంచాయతీ చింతావారిపల్లెకు సమీపంలో గుట్టకు ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. భారీగా మంటలు చెలరేగి గుట్టకు ఆనుకుని ఉన్న పొలాల వైపు మళ్లాయి. దీంతో రైతు హరినాధరెడ్డి సాగు చేసిన రెండున్నర ఎకరాల ఉలవ పంట పూర్తిగా కాలిపోయింది. పంట చేతికొచ్చే సమయంలో దగ్ధం కావడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఇదే రైతుకు కొబ్బరి చెట్లు కూడా కాలిపోయాయి. మూడు వేల టమోటా కట్టెలు కాలిపోయాయి. రైతు సిద్దప్ప పొలంలో పీవీసీ పైపులు, డ్రిప్ పైపుల కట్టలు, వెంకటరమణ పొలంలో బోరు మోటారుకు అమర్చిన స్టార్టర్ పెట్టె, 2 వేల టమోటా కట్టెలు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంతో నలుగురు రైతులకు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేందుకు యత్నించారు. గుట్ట ప్రాంతం కావడంతో ఫైర్ ఇంజన్ వెళ్లేందుకు వీలు కాలేదు. అతి కష్టం మీద సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలు మిగిలిన పొలాలకు వ్యాపించకుండా ఆర్పి వేశారు.

కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

వేంపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నులులో గాని, శ్రీశైలంలో గాని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డు శ్రీశైలం పరిధిలోని ప్రాజెక్టులకు సంబంధించినదే అని రాయలసీమలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ప్రజాఫిర్యాధుల స్వీకరణ

కడప కలెక్టరేట్‌తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9-30 నుంచి 10గంటల వరకు డయిల్ యువర్ కార్యక్రమంతో పాటు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాలు జరుగుతాయని డీఆర్వో ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, మండల, మున్సిపల్ కమిషనరు కార్యాలయాల్లో అర్జీలు సమర్పించాలని తెలిపారు.

జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడిగా రమణారెడ్డి



వేంపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (క్రూష్మా) అధ్యక్షుడిగా వేంపల్లెకు చెందిన ఉషాకిరణ్ హైస్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో రెండవసారి ఆయన్ను ఎన్నుకున్నారు. ప్రైవేటు పాఠశాల ఎదుర్కొంటు న్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని రమణారెడ్డి తెలిపారు.

పరిహారం ఇవ్వకుండా పనులు చేస్తున్నారు

- సోలార్‌కంపెనీ నిర్వాకంపై రైతులు ఆవేదన



పొలంలో పాతిన ఇనుప దిమ్మెలు చూపిస్తున్న రైతు శ్రీనివాసులు

పెద్దముడియం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తమ అనుమతి, అంగీకారం లేకుండా సోలార్ కంపెనీ మా పొలాల్లో పనులు చేపట్టిం దంటూ పలువురు రైతులు వాపోతున్నారు. పెద్దముడియం మండలం కల్వటాల గ్రామ పరిధిలో ఓ సోలారు కంపెనీ పలువురు రైతులకు చెందిన పంట పొలాలను లీజుకు తీసుకుని సోలార్‌ప్యానెల్‌ను అమర్చుతోంది. అయితే తమ ప్రమేయం లేకుండానే పొలంలో ఇనుప దిమ్మెలు ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ సమస్యను పెద్దముడియం పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. కలవటాల గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు సర్వే నెం.661లో ఎకరా 50 సెంట్లు, సుబ్బరాయుడు అనే రైతుకు 662 సర్వేనెంబరులో 2 ఎకరాల 10 సెంట్లు పొలం ఉంది. అయితే అంగీకారం లేకుండానే సుబ్బరాయుడు పొలాన్ని చదను చేశారు. అలాగే శ్రీనివాసులు పొలంలో గోతులు తవ్వి సిమెంటు దిమ్మెలను కూడా ఇటీవల ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని సోలార్ కంపెనీ ప్రతినిధుల దృష్టికి తీసుకుపోగా పరిష్కారం చేస్తామంటూ చెప్పారే తప్ప ఇంత వరకు న్యాయం చేయలేదని బాధితులు వాపోయారు. ఈ విషయాన్ని పెద్దముడియం పోలీసుల దృష్టికి తీసుకుపోగా ఫిర్యాదు స్వీకరించారు. అయితే కంపెనీ ప్రతినిధులు రైతుల మధ్య చర్చలు జరుగుతుండడంతో పోలీసులు కూడా ఇంత వరకు కేసు నమోదు చేయలేదు. ఇప్పటికైనా కంపెనీ ప్రతినిధులు తమకు పరిహారం అందించి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి విశ్వనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

పెండ్లిమర్రి;ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి); నందిమండలం గ్రామంలో పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన పర్వతవర్ధిని సమేత విశ్వనాథస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు అభిషేకాలు,పూజలతో పాటు మహిళలకు ముగ్గుల పోటీలు,చెక్కభజన ఉంటాయన్నారు. రెండో రోజు కోలాట ప్రదర్శన, మూడో రోజు బుధవారం ఉదయం కల్యాణం, సాయంత్రం స్వామి వార్ల గ్రామోత్సవం ఉంటాయన్నారు. అలాగే మూడు రోజుల పాటు అన్నదానం ఉంటుందని తెలిపారు.

పారిశుధ్యంతోనే అభివృద్ధి

వల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎప్పుడు అయితే పారిశుధ్యం బాగా ఉంటుందో ఆ గ్రామం అన్నివిధాలా అభివృద్ధి చెందుతాయని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లాకో-ఆర్డినేటరు సుజాత అన్నారు. ఆదివారం వల్లూరు గ్రామ పంచాయతీలో పారిశుధ్యం పట్ల ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతిరోజూ తమ ఇళ్ల వద్దకు వచ్చే రాయబారులకు తమ ఇంటిలోని చెత్తను తాము ఇచ్చిన బుట్టల ద్వారా వారికి అందించాలన్నారు. వీరి వెంట ఆర్పీ రాఘవరెడ్డి,హరిత రాయబారులు తదితరులు ఉన్నారు.

వంతెన ఎత్తు తగ్గించవద్దు

కమలాపురం రూరల్. ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామంలోకి వెళ్లే దారిలో రైల్వే బ్రిడ్జి కింద ఉన్న వంతెన ఎత్తును తగ్గించవద్దంటూ గోపులాపురం గ్రామానికి చెందిన శివరాంరెడ్డి బాలిరెడ్డి, గంగిరెడ్డితో పాటు ప్రజలు రైల్వే అధికారుల వద్ద నిరసన తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని గోపులాపురం గ్రామ సమీపంలో ఉన్న రైల్వే వంతెన వద రైల్వే సిబ్బంది బ్రిడ్జి ఎత్తు తగ్గించేందుకు కొలతలు తీసుకున్నారు. ఆ విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఆ ప్రాంతానికి వెళ్లి బ్రిడ్జి ఎత్తు తగ్గించవద్దంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గోపులాపురం గ్రామానికి వెళ్లేందుకు ప్రధాన దారి ఎత్తు తగ్గిస్తుండడంతో తమ గ్రామంలోకి ఏ వాహనాలూ వెళ్లవని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, కేశవరెడ్డి, రాంబాబు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

సింహాద్రిపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు పాఠశాలలోని వాతావరణం కూడా కొంత వరకు దోహదపడుతుందని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సింహాద్రిపురం పాఠశాలను ఆయన సందర్శించారు. ఆదివారం స్టడీ అవర్స్‌లో వున్న పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు చెన్నకేశవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో సీమకు 42శాతం నిధులు కేటాయించాలి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో రాయలసీమకు జనాభా ప్రాతిపదికన 42శాతం నిధులు కేటాయించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి కోరారు. ఆదివారం తన కార్యాలయంలోని నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత పాలకులే రాయలసీమను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీయు రాష్ట్ర కార్యదర్శి సిద్దరామయ్య, ఆర్‌సీపీ నగర కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

పాతచెరువుకు నీరు విడుదల చేయాలి

లింగాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పాతచెరువుకు కుడికాల్వ నుంచి నీటిని విడుదల చేయించాలని పులివెందుల వైసీపీ రైతు విభాగం అధ్యక్షుడు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కడప ఎంపీ అవినాష్‌రెడ్డిని కోరారు. పులివెందులలో ఆదివారం అవినాష్‌రెడ్డిని కలిసి లింగాలలో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించాలని కోరారు.

ముందుకు కదలని మురుగు

పారిశుధ్య చర్యలు అధ్వానం ● కాలువల్లో పేరుకుపోతున్న చెత్త

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. దీనితో మురుగు ముందుకు కదలడం లేదు. అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో పెద్దఎత్తున చెత్త మురుగుకాల్వల్లో పేరుకుపోతోంది. నగరంలోని ప్రధానంగా ఏఎస్ఆర్‌నగర్, రామరాజుపల్లె, సన్‌సిటీ, రామాంజనేయనగర్ కాల్వల్లో మురుగు కదిలే పరిస్థితి లేదు. దోమల బెడద పెరిగిపోతోంది. ఎక్కడకు వెళ్లినా మురుగు కంపుకొడుతోంది. పట్టణంలోని ప్రధాన కాల్వలు మూడు నెలలకు ఒకసారి కూడా శుభ్రం చేయడం లేదు. ప్రజలు కొన్ని ప్రాంతాలలో చెత్తను కాల్వల్లో వేయడంతో మురుగు కదలడం లేదు. పరిశుభ్రత లోపించడంతో పాటు అంటు వ్యాధులు వ్యాపిస్తున్నాయి. సన్‌సిటీ ఎదురు కాల్వ నిర్మాణం చేయాలని కార్పొరేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ కమిషనర్లు వచ్చారు... చూశారే తప్ప ఇంత వరకు ఎటువంటి చర్యలు కూడా తీసుకున్న దాఖలాలు లేవు. కనీసం మురుగు కాల్వల్లో పూడికలు కూడా తీయని పరిస్థితి. పలుప్రాంతాలలో వైద్యశాలలకు సంబంధించిన చెత్తను కూడా కాల్వల్లోనే వేస్తుండడంతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఏర్పడింది.



హోమియోపతి కాలేజీ రోడ్డులో కాల్వ దుస్థితి

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిసేవ్యానాయక్ తెలిపారు. ఆదివారం కడప నగరం ఎల్ఐసీ ఉపకేంద్రంలో నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు బదులుగా 8ఎంవీఏను ఏర్పాటుచేశామన్నారు. విద్యుత్ ఇచ్చేందుకు వీలుగా ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మనాయక్, సుబ్బారావు, ఏఈలు హరికృష్ణ, ఓ అండ్ ఎం సిబ్బంది, టీఆర్ఇ సిబ్బంది పాల్గొన్నారు.

305 మందికి ఉచిత వైద్యశిబిరం

వేంపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఆవోపా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత న్యూరో వైద్యశిబిరంలో 305 మంది పరీక్షలు చేయించుకున్నారు. కడప నవీన్ న్యూరోకేర్ ఆధ్వర్యంలో ఆసుపత్రి డాక్టర్లు నవీన్‌ప్రసాద్ తదితరులు వైద్యపరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ, ఎముకల సాంద్రత పరీక్ష, నరాల పటుత్వ పరీక్షలను చేశారు. ఈ కార్యక్రమంలో ఆవోపా మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవులస్వామి తిరునాళ్లు



లింగాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబకపల్లె గ్రామంలో ఆదివారం ఆవులస్వామి తిరునాళ్ల ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు భారీగా చేరుకొని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. గుడి దగ్గర భక్తులందరికీ గ్రామస్థులు భోజనం ఏర్పాట్లు చేశారు. కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ఆవులస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా టీడీపీ నాయకులు భరత్ రెడ్డి,సంజీవరెడ్డి కూడా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేవరకోనలో విగ్రహప్రతిష్ఠ

లింగాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిదండ్ల గ్రామ సమీపంలో వెలసిన దేవరకోనలో ఆదివారం అనంత నాగేంద్రుడు, బాలసుబ్రమణ్యం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్థులు నిర్వహించారు. వేదపండితులు సోమశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే చౌడమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

విద్యార్థులు ధ్యానం అలవరచుకోవాలి

వేంపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ధ్యానాన్ని అలవరచుకోవాలని మానసిక ప్రశాంతం పొందుతూ ఏకాగ్రత పెంచుకోవాలని పులివెందుల విపశ్యన కేంద్రం ఉపాధ్యాయులు తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పీయూసీ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ధ్యానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. సుమారు 3500 మంది విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో సూచనలు ఇచ్చారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవడం ధ్యానం ద్వారా సాధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త కుప్పలు
ఇంతేనా..?



కడప క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం చిన్నచౌకులోని మద్రాసు రోడ్డు వద్ద రోడ్డుపై స్థానికులు చెత్త వేయడంతో అది పెద్ద దిబ్బగా మారింది. చిన్నపాటి గాలికి రోడ్డు పైకి చెత్తంతా పడిపోతుంది. దీంతో వాహన దారులే కాకుండా పాదచారులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డుపై ఇలా చెత్త వేయడంతో కొన్ని వ్యర్థాలు పక్కనే ఉన్న మురుగు కాల్వలో పడిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కనీసం ఇక్కడ చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని పలువురు పేర్కొంటున్నారు.

శిల్పారామంలో విద్యార్థుల నృత్యాలు అదుర్స్

కడప కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ వద్దగల శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సంబంధిత పరిపాలనాధికారి పి. శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. కడపకు చెందిన షర్మిల ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థులు వివిధ జానపద, సినీ గీతాలకు చేసిన నృత్యాలు అదుర్స్ అనే రీతిగా సాగాయి. కార్యక్రమంలో ఆ స్కూల్ కరస్పాండెంట్ షర్మిల పాల్గొన్నారు.



వైభవంగా పోలేరమ్మ తిరునాళ్లు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరెడ్డి

కడప కల్చరల్ ఫిబ్రవరి 23, (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీపంలో ఉన్న పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సమీపంలో నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కాగా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, 40వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ కర్నాటి ఓబుల్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఇందులో ప్రథమ విజేతగా ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన గురివిరెడ్డి (70వేలు- కర్నాటి ఓబుల్‌రెడ్డి) ద్వితీయ విజేతగా ప్రొద్దుటూరు రంగసాయిపల్లెకు చెందిన ఎం. వెంకటసుబ్బారెడ్డి (50వేలు-విజయ్ కుమార్) తృతీయ విజేతగా ప్రొద్దుటూరుకు చెందిన శివకృష్ణయాదవ్ (30వేలు-సంపత్‌కుమార్)ల ఎద్దులు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో బీసీ. నాయకులు గోవిందు నాగరాజు. గువ్వల మధుసూదన్, కర్నాటి చంద్ర ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రగతికి దోహదపడే కేంద్ర బడ్జెట్



మాట్లాడుతున్న వినూషరెడ్డి

కడప మారుతీనగర్,ఫిబ్రవరి 23, (ఆంధ్రజ్యోతి): మన దేశ ఆర్థిక ప్రగతికి దోహదపడేలా కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వినూషరెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షతన ఆదివారం స్థానిక కో-ఆపరేటివ్ కాలనీలోని మయూర గార్డెనీయా సమావేశ భవన్‌లో జరిగిన మేధావుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథి గా హాజరై మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతిని కాంక్షిస్తూ నరేంద్రమోదీ పాలన సాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, పలువురు వ్యాపారులు, న్యాయవాదులు, డిస్టిబ్యూటర్స్, మేధావులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి



చర్చావేదికలో మాట్లాడుతున్న నాయకులు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పేద ముస్లిం, మైనార్టీల సంక్షేమం కోసం రాజులు, నవాబులు, దాతలు వక్ఫ్ కోసం భూములను దానం చేస్తే ఆ భూములపై బీజేపీ ప్రభుత్వం చట్ట సవరణకు దిగడం అన్యాయమని, వెంటనే ఆ బిల్లును ఉప సహరించుకోవాలని రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వక్ఫ్ సవరణ బిల్లుపై ఏఐసీసీ కో-ఆర్డినేటర్ ఎస్.ఎ.సత్తార్ ఆధ్వర్యంలో చర్చా వేదిక జరిగింది. ఈ చర్చా వేదికలో సీపీఎం కార్యదర్శి చంద్ర శేఖర్, కాంగ్రెస్ పార్టీ నుంచి బండిజకరయ్య, గౌస్ పీర్, ఎస్సీ హ్యూమన్ రైట్స్ నుంచి జేవీ రమణ, మహాసభ అవ్వారు మల్లికార్జున, రామాంజనేయులు తదితర నేతలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకొనేలా చట్ట సవరణకు దిగడం అన్యాయమన్నారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

బీరువా వితరణ

వేంపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సంస్థకు స్థానిక ఫిజియోథెరపీ డాక్టర్ యోగీశ్వరబాబు ఇనుపబీరువాను విరాళంగా ఇచ్చారు. మానవత నెల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బీరువాను మానవత ప్రతినిధులకు అందించారు. మానవత భవిష్యత్ కార్యచరణ గురించి చర్చించారు. చైర్మన్ చక్రపాణిరెడ్డి, చల్లాబాలాజీ, శ్రీకళ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నను ముంచిన జొన్న

● క్రాసింగ్ జొన్న మంచి దిగుబడి ఇస్తుందని కంపెనీల ఏజెంట్లు మోసం చేశారంటున్న రైతులు ● పరిహారం ఇస్తామని తప్పించుకున్న వైనం

దువ్వూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రైతన్నకు కష్టాలు తప్పడంలేదు., జొన్న పంటతోకూడా నష్టాలు కొని తెచ్చుకుని లబోదిబోమంటున్న దుస్థితి దువ్వూరు మండలంలో చోటుచేసుకుంది. క్రాసింగ్ జొన్నలు సాగు చేసిన రైతుల పరిస్థితి ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని మా కంపెనీ జొన్నలు సాగు చేయమని సదరు కంపెనీల ఏజెంట్లు రైతుల చుట్టూ తిరిగి ఎకరాకు పండకపోయినా రూ.50 వేలు పరిహారం ఇస్తామని నమ్మబలికారు. ఆ మేరకు అగ్రిమెంట్లు రాసిస్తామని చెప్పి అగ్రిమెంట్లు రాసివ్వకుండా తిన్నగా జారుకున్నారు. తీరా దిగుబడి చేతికందే సమయానికి కంకిలో తాలుగింజలు ఏర్పడి ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి కూడా అందని పరిస్థితి తలెత్తడంతో సదరు కంపెనీ విత్తనాలు సాగు చేసి మోసపోయామని రైతులు లబోదిబోమంటున్నారు. దువ్వూరు మండలంలో కానగూడూరు, రాంసాయినగర్, జిల్లేళ్ల, చింతకుంట, రామాపురం, మదిరేపల్లి, మూడిండ్లపల్లె, నీలాపురం, చిన్నభాకరాపురం, దువ్వూరు, నేలటూరు, ఎర్రబల్లి, ఏకోపల్లె, వెంకుపల్లె, పెద్దజొన్నవరం గ్రామాల పరిధిలో క్రాసింగ్ జొన్న సాగు చేశారు. సరాసరి రెండు వేల ఎకరాల్లో క్రాసింగ్ జొన్న వేసి ఉంటారని అధికారుల అంచనా. ఏజెంట్ల మాటలు నమ్మి ఎకరాలో పంట సాగుకు రూ.45 వేలు దాకా పెట్టుబడుల కింద వెచ్చించారు. కౌలు రైతులు అదనంగా 20 నుంచి రూ.25 వేలు కౌలు చెల్లించి భూములు తీసుకుని పంటవేశారు. కొంతమేరకు వాతావరణం కూడా సహకరించని పరిస్థితి నెలకొనడం మరోపక్క కంకిలో గింజ కట్టకుండా తాలు ఏర్పడడంతో రైతులు ఏమితెలియాలో దిక్కుతోచక తలలుపట్టుకుంటున్నారు. పంట తొలగించిన రైతులకు నామమాత్రపు దిగుబడులు అందుతుండడంతో బిక్కమొఖం వేసుకుని అధికారులవైపు చూస్తున్నారు.



పాలుపోయిన క్రాసింగ్ జొన్న పంట

పరిహారం ఇవ్వకపోతే కంపెనీలపై చర్యలు

మండలంలో క్రాసింగ్ జొన్నకు సంబంధించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోతే సదరు కంపెనీలపై కేసులు పెడతాం. విత్తనాలు ఇచ్చిన ఏజెంట్లతో మాట్లాడాం. అగ్రిమెంట్లు ఇవ్వలేదు. ఎకరాకు రూ.50వేలు చెల్లిస్తామన్నారు. 40 రోజులు గడువు అడిగారు. మరో రూ.10వేలు రైతులకు బోనస్‌గా చెల్లించాలని చెప్పాము.

-అమరనాథ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, దువ్వూరు

కౌలు భూమిలో జొన్న వేశా



భూమి కౌలుకు తీసుకుని క్రాసింగ్ జొన్న వేశాను. మంచి లాభాలు వస్తాయని ఏజెంట్లు నమ్మబలికారు. ఒక టిన్నర ఎకరంలో ఆరు క్వింటాళ్లు మించి దిగుబడి రాలేదు. కంకి కట్టలేదు. కంకి తాలుపోయింది.

- జె.సునీల్, రైతు, దువ్వూరు

కోత ఖర్చులు రావడంలేదు



క్రాసింగ్ జొన్న పంట కోత ఖర్చులు కూడా దక్కడంలేదు. జొన్న, మొక్క జొన్న రెండు రకాల పంట వేశాను. ఎకరాకు రూ.60 వేలు పరిహారం ఇస్తామంటున్నారు. గింజ కట్టక దిగుబడి అందని పరిస్థితి.

-పెద్దఓబయ్య, రైతు,దువ్వూరు

వాతావరణం తోడ్పడలేదు



జొన్న పంట సాగు చేసిన రైతులకు వాతావరణం సహకరించలేదు. నాలుగున్నర ఎకరంలో పంట వేసి కౌలుతో రూ.1.70 లక్షలు పెట్టుబడి అయింది. క్రాసింగ్ సమయంలో వానలు , మొగలి ప్రభావం చూపాయి.

- డి.రమణ, రైతు, దువ్వూరు

రూ.80 వేలు పరిహారమివ్వాలి



ఎకరాకు రూ.80 వేలు నష్టపరిహారం ఇవ్వాలి. పది ఎకరాల్లో పంట వేశాను. ఏకోపల్లి పొలంలో పెట్టిన పైరు గింజలు తాలుపోయాయి క్రాసింగ్ జరుగలేదు. ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి కూడా అందేటట్లు లేదు.

- మాధవరెడ్డి, రైతు, జొన్నవరం

పోలీసు స్టేషన్‌కు చేరిన ఓపెన్ ఇంటర్ ప్రశ్నపత్రాలు



జమ్మలమడుగు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌కు ఆదివారం మధ్యాహ్నం ఓపెన్ ఇంటర్ ప్రశ్నాపత్రాలు చేరాయి. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో కడప నుంచి చేరిన ప్రశ్నాపత్రాల బండిల్స్‌ను ఉపాధ్యాయులు భద్రపరచి స్టేషన్‌లో పెట్టారు. మార్చి 3వ తేదీ నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మైలవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని ప్రముఖ మోటివేటర్, మానసిక నిపుణుడు డాక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బీసీ హాస్టల్‌లో 10వ తరగతి విద్యార్థుల శిక్షణ, ప్రేరణను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు పొందడం ఎలాగో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులందరు వందశాతం ఉత్తీర్ణత సాధించి ఐఐటీలో సీటు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం, దొమ్మరనంద్యాల వసతి గృహ అధికారులు సుజాత, వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు దానం, వెంకటరావు, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

26న బండలాగుడు పోటీలు

మైలవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని లింగాపురం పంచాయతీలోని త్రిమూర్తుల కోనలో ఈనెల 26వ తేదీన రాయలసీమ సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. బండలాగుడు పోటీల్లో అయిదు బహుమతులు, ట్రాక్టర్ రివర్స్ పోటీలకు నాలుగు బహుమతులు ఉంటాయని తెలిపారు. శివపార్వతుల కల్యాణం, అన్నదాన ఉంటుందన్నారు.

నేడు గండికోట ముంపు సమస్యలపై సదస్సు

కొండాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు ముంపువాసుల సమస్యలపై సోమవారం సదస్సు నిర్వహించనున్నట్లు మండల సీపీఐ కార్యదర్శి మనోహర్‌బాబు తెలిపారు. మండలంలోని ఓబన్నపేట ఆర్ అండ్ ఆర్ కమ్యూనిటీ హాల్ లో ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ సదస్సుకు రాష్ట్ర, జిల్లా సీపీఐ, రైతుసంఘం నాయకులు హాజరవుతారన్నారు. ఈ సదస్సుకు గండికోట ప్రాజెక్టు క్రింద ముంపునకు గురైన 22 గ్రామాల నిర్వాసితులు హాజ.రుకావాలని ఆయన తెలిపారు.

శివభక్తేంద్రస్వామి పుస్తకావిష్కరణ

ఖాజీపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శివభక్తేంద్రస్వామి చరిత్రను పరిశోధన దృక్పథంతో రచించడం సంతోషమని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. ఆదివారం శివభక్తేంద్రస్వామి ఆలయంలో మూలమల్లికార్జునరెడ్డి రచించిన శివభక్తేంద్రస్వామి చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ అధికార భాషా సభ్యులు తవ్వా వెంకటయ్య, కోశాధికారి శేఖర్‌రెడ్డి, ఓబుళరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, ముసలయ్య, సుబ్బారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్‌ముక్తియార్ పేర్కొన్నారు. ఆదివారం మన ప్రజాసేవా సమితి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం 250 మంది రోగులను వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మన ప్రజాసేవా సమితి అధ్యక్షులు ఆయూబ్‌ఖాన్, ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి షేక్ సలీం, మాజీ కౌన్సిలర్ ఖలీల్, ముక్తియార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయి డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం



శ్రీసాయి డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక హోమస్‌పేటలోని డాక్టర్ రామలింగారెడ్డి ఆస్పత్రి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీసాయి డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంబించారు. ఈ సందర్భంగా రేడియాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా గాంధీరోడ్డులో ల్యాబ్ సంబంధిత నిర్ధారణ రిపోర్టులు అందజేస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నామన్నారు. పట్టణ ప్రజలకు మరిన్ని సౌకర్యాలతో అత్యాధునికమైన పరికరాలతో అన్ని వసతులతో నూతన భవనంలో సిటీస్కాన్, అల్ట్రాసౌండ్, డిజిటల్ ఎక్స్‌రే, డెంటర్ సీబీసీటీ, ఓపీజీ, అడ్వాన్స్‌డ్ లేబరేటరీ, ఈసీజీ వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ వైద్యులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్దలతో శ్రీరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం

భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



బ్రహ్మంగారిమఠం. ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కేశవాపురంలో సీతారాముల నూతన విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి మధ్యాహ్నం 3గంటలకు సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి మండలంలోని చుట్టుపక్కల గ్రామాలోని ప్రజలు తరలివచ్చి తిలకించారు. అనంతరం వృషభరాజములచే బండలాగుడు పోటీలు చేపట్టారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానపల్లె గ్రామంలో ఆదివారం పెద్దమ్మతల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, గుమ్మల లత దంపతులు, సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి, గ్రామ పెద్దలు రాజారెడ్డి, సంజీవరెడ్డి, నారాయణరెడ్డి, దేవేంద్రారెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

చిన్నారులను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): చిన్నారులను సెల్ ఫోన్ చూసేందుకు దూరంగా ఉంచాలని అమ్మ హియరింగ్ సెంటర్ డాక్టర్ చైతన్యకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మానవత ఎర్రగుంట్ల యూనిట్ నిర్వహించిన స మావేశంలో మాట్లాడుతూ చిన్నారులకు సెల్ ఎక్కువగా ఇవ్వడం వల్ల కంటి చూ పు దెబ్బతింటుందన్నారు. అనంతరం కాలు విరిగి, మంచానికే పరిమితమైన ఒంటరి మహిళ పార్వతికి మానవత సంస్థ ద్వారా రూ.5500 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ డి.రఘురామిరెడ్డి, అధ్యక్షుడు ఎస్.రామాంజనేయరెడ్డి, ట్రజరర్ మల్లికార్జునరెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే ఉచిత కంటి పరీక్షలు



వర్చ్యువల్‌గా మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల కంటి ఆరోగ్యాన్ని కాపాడటానికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. ఆదివారం డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డి కంటి ఆస్పత్రిలో స్పిండ్ అమరీష్ అడ్వాన్స్‌డ్ లాసిక్ మిషన్‌ను మంత్రి వర్చ్యువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 19 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 90 వేల మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. 45 సంవత్సరాలు పైబడిన వారందరికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డి సామాజిక సేవలో భాగంగా అధునాతన లాసిక్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ వైవీయూ రామమునిరెడ్డి, డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ అవసరం





మాట్లాడుతున్న శివదర్శనానందసరస్వతి మాతాజీ హాజరైన తల్లిదండ్రులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణను అలవర్చుకున్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని శివదర్శనానంద సరస్వతి మాతాజీ పేర్కొన్నారు. గౌతమ్ హైస్కూలు 37వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాతాజీ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచి క్రమశిక్షణతో మెలిగి ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేసి పాఠశాలకు మంచిపేరు తేవాలని సూచించారు. అనంతరం విద్యలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి.సుధీర్, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, పాఠశాల సభ్యురాలు హర్షప్రియ, డాక్టర్ మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చదువులబాబుకు సాహితీపురస్కారం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బాలసాహిత్యం రచయిత డీకే చదువులబాబుకు చిత్తూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శాంతాబాయి, శ్రీధర్‌రావు స్మారక సాహిత్య పురస్కారం అందజేశారు. ఆదివారం చిత్తూరులోని విజయం విద్యాసంస్థలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత సీఎస్ చంద్రశేఖర్ చేతుల మీదుగా శాంతాబాయి, శ్రీధర్‌రావు స్మారక సాహిత్య పురస్కారం అందజేశారు. చదువులబాబు కృషికి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరుజిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, జయంతి పబ్లికేషన్ నిర్వాహకులు ఎస్‌వీ క్రిష్ణ, డాక్టర్ రామలక్ష్మి, పలమనేరు బాలాజీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం దారుణం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘాల నాయకులను ప్రభుత్వం అరెస్టు చేయడం దారుణమని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజు విమర్శించారు. ఆదివారం డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోస్టర్ పాయింట్లలో తప్పులను సవరించి గ్రూప్-2 పరీక్షలు నిర్వహించాలని డీవైఎఫ్‌ఐ మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులను లెక్కచేయకుండా పరీక్షలు నిర్వహించడం దారుణమన్నారు. నిరుద్యోగులకు వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి చేద్దాం



గురువులను సన్మానించిన పూర్వవిద్యార్థులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేద్దామని పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీకళాశాల పూర్వ విద్యార్థుల సంఘం విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు రమణారెడ్డి, దాదాపీర్, వీరనాగేంద్ర, జానకి, భాను, వీణ, మాధురి కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ డేవిడ్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, సులోచన తదితరులను సన్మానించారు.

పశువైద్య విద్యార్థుల ఉపకార వేతనాలు పెంచాలి



నిరసన తెలుపుతున్న పశువైద్య విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పశువైద్య విద్యార్థులకు ఉపకార వేతనాలు పెంచాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరారు. ఆమేరకు పశువైద్య కళాశాల విద్యార్థులు నిరసన దీక్ష కొనసాగించారు. ఆదివారం 21వ రోజు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా కళాశాల ఆవరణలోని దీక్షాశిబిరంలో కూర్చొని సాయంత్రం వరకు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2013 నుంచి పశువైద్య కళాశాల విద్యార్థులకు రూ.7 వేలు మాత్రమే స్టైఫండ్ ఇస్తున్నారని, ఇతర రాష్ట్రాల్లో పశువైద్య కళాశాల విద్యార్థులకు రూ.20 వేలకుపైగా స్టైఫండ్ అందుతోందన్నారు. వైద్య రంగ విద్యార్థులకు కూడా రూ.26 వేల స్టైఫండ్ ఇస్తున్నారని తమపై ఎందుకు ఇంత వివక్షత చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరితో సమానంగా తమకు స్టైఫండ్‌ను పెంచుతూ ప్రభుత్వం జీవోను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి



కృష్మా నూతన కార్యవర్గ సభ్యులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కడపజిల్లా గుర్తింపు పొందిన ప్రైవేటు యాజమాన్య సంఘం (కృష్మా) జిల్లా అధ్యక్షుడు బీఎస్ రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గోల్డెన్ పార్కులో సంఘం నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా బీఎస్ రమణారెడ్డి (వేంపల్లె), ప్రధాన కార్యదర్శిగా బి.బాలసుబ్బారెడ్డి (ప్రొద్దుటూరు), కోశాధికారిగా ఎ.ఆంజనేయులు (జి.వి.సత్రం), 35 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బీఎస్‌రమణారెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకుడు సోమశేఖర్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు చక్రపాణిరెడ్డి, మాధవరెడ్డి, పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిధులు రూ.10లక్షలు మంజూరు



సీఎంసహాయనిధి పత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తాళ్లమాపురంకు చెందిన అశోక్‌రెడ్డి కాలేయ వ్యాధితో బాధపడుతుండడంతో ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆదివారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరు చేసిన పత్రాన్ని అశోక్‌రెడ్డి సోదరునికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా అశోక్‌రెడ్డి కాలేయ వ్యాధితో తీవ్రంగా బాధపడుతూ హైదరాబాదులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని సమస్య తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆయన చికిత్సకోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారన్నారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి కుటుంబ సభ్యులు మంత్రి సత్యకుమార్‌యాదవ్ సీఎంఎఫ్‌ఆర్ ద్వారా ఆర్థికసాయం అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంటేరు భాస్కర్‌రెడ్డి, షేక్షావలి, భాస్కర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి బద్వేలు నుంచి ప్రత్యేక బస్సులు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బద్వేలు డిపో నుంచి మల్లెంకొండ, లంకమల, ఎన్ఎస్ మఠం తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజరు ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఆదివారం స్థానిక డిపోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎం మాట్లాడుతూ ప్రయాణికులకు, భక్తులకు సౌకర్యంగా మైదుకూరు రోడ్డులోని నందిపల్లె వద్ద ఒక పాయింటు, నెల్లూరురోడ్డు పీపీకుంట వద్ద ఒక పాయింట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. లంకమలకు 22 బస్సులను, మల్లెంకొండకు ఐదు బస్సులను, బ్రహ్మంగారిమఠం, ఎన్ఎస్ మఠంలకు మూడు, మూడు బస్సులను నడుపుతామన్నారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లే ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో ఎస్‌టీఐ నాయక్ పాల్గొన్నారు.

మట్టిమాఫియాపై చర్యలు చేపట్టాలి

బద్వేలు, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు విజృంభిస్తున్న మట్టిమాఫియా బారి నుంచి నియోజకవర్గాన్ని కాపాడాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను దక్కించుకున్న కొంతమంది సబ్ కాంట్రాక్టర్లు రాజకీయ పలుకుబడితో అనుమతులకు మించి తవ్వకాలు జరిపి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారని విమర్శించారు. ఈ అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా నాయకులు చంద్రశేఖర్, చంద్రమోహన్‌రాజు,,నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళలపై దాడులను అరికట్టాలి



కడపకు తరలివెళ్తున్న ఐద్వా మహిళలు

బద్వేలు, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై సమాజంలో నానాటికి జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐద్వా పట్టణ ఉపాధ్యక్షురాలు మోక్షమ్మ, ఖైరున్‌బీలు పేర్కొన్నారు. ఆదివారం కడపలో జరిగే విస్తృత స్థాయి సమావేశానికి తరలివెళ్లారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజం కుటుంబ న్యాయవ్యవస్థ, ప్రభుత్వాలు, పోలీసులు, మహిళలకు న్యాయం కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సోషల్ మీడియా, సెల్‌ఫోన్లలో నీలిచిత్రాలను అరికట్టేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో పలువురు ఐద్వా సంఘం నాయకురాళ్లు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వివేకానందభవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ వర్కింగ్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణం ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సంక్షేమ పథకాలు లబ్ధి పొందుటకు వెంటనే కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికునికి ప్రమాద బీమా రూ.10లక్షలు పెంచాలని సాధారణ మరణం చెందిన కార్మికునికి 5లక్షలు పెంపు కల్పించాలన్నారు. అనంతరం నూతన యూనియన్ ఎన్నుకున్నారు. నూతన ఎలక్ట్రీషి యన్ అధ్యక్షునిగా గాజులపల్లె సూర్యకుమార్, ప్రధాన కార్యదర్శిగా మహబూబ్‌వలితో పాటు 9 మంది కార్యవర్గసభ్యులను 13 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



కాశినాయన/పోరుమామిళ్ల, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థులు 120 మందికి పరీక్ష సామగ్రి అందజేశారు. ఇందులో కలసపాడు మండలంలోని పెండ్లిమర్రి, కాశినాయన మండలంలోని వరికుంట్ల గ్రామాల్లోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థినులకు ఆదివారం వివేకానంద సేవాసమితి వ్యవస్థాపకుడు పి.రామక్రిష్ణారెడ్డి పరీక్షా సామగ్రి అందజేశారు. సంస్థప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి,కిరణ్‌కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. పోరుమామిళ్ల, బికోడూరు పరిధిలోని కస్తూర్బా బాలికల గాంధీ పాఠశాలలో విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేసినట్లు వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామక్రిష్ణారెడ్డి తెలిపారు . ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.